క్లుప్తంగా

వికాస్ విహార్ విద్యార్థులకు అన్నదానం


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

కడప కల్చరల్: కడప నగరంలోని చెన్నూరు బస్టాండు సమీపంలోని వికాస్ విహార్(రాస్)మానసిక వికలాంగుల కేంద్రం విద్యార్థులకు దాతలు శనివారం అన్నదానం చేశారు. నంది మండలానికి చెందిన నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సంస్మరణగా ఆయన సతీమణి లక్ష్మీ మనోహరదేవి చిన్నారులకు భోజనం, స్వీట్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు బాలఎల్లారెడ్డి, నాగమునిరెడ్డి, లలితమ్మ, పద్మావతి చంద్రకళ, తులసి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


వైవీయూలో మొక్కలు నాటుతున్న వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి

వైవీయూ: దైనందిక జీవితంలో మొక్కల పెంపకం.. ఓ భాగం కావాలని, వాటితోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్–2 , 8 ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్ పీ.వెంకటరమణ, డాక్టర్ సుమిత్ర ఆధ్వర్యంలో వాలంటీర్లు 300 మొక్కలను నాటారు. ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డా.సరిత, డా.అనుప్రసన్న, వలంటీర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: వైఎస్‌ఆర్ కడప జిల్లా పరిధిలోని 1962 మొబైల్ వెటర్నరీ అంబు లెన్స్‌లో పైలెట్లు(డ్రైవర్లు)గా పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 1962 పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి అనిల్‌కుమార్ కోరారు. 36 సంవత్సరాలలోపు వయోపరిమితి కలిగి ఉండి 10వ తరగతి ఉత్తీర్ణత, హెవీడ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9154970180 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉద్యోగాలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

వైవీయూ: టీటీఎఫ్‌డీ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కడప నగరంలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ బి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డా. వై. నాగరాజ తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు కిశోర్, జయలక్ష్మి, ప్రశాంత్, మీనాలను వారు అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు

వైవీయూ: సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలో పనిచేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌ను కోరారు. కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో ఆయనను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

చారిత్రక కట్టడాలపై అవగాహన


విద్యార్థులతో ఇంటాక్ ప్రతినిధులు

వైవీయూ: జిల్లాలోని అపురూప శిల్ప సంపద.. జిల్లా ఔన్నత్యాన్ని చాటి చెబుతుందని ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో ఇంటాక్ ఆధ్వర్యంలో చారిత్రక కట్టడాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ మాట్లాడుతూ జిల్లాకు ఎంతో ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు. లలితకళల విభాగం విద్యార్థులు శిల్పకళా సంపదపై అధ్యయనం చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ ఎస్. రాజేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కళలు, సాహిత్యంతో పాటు ఎంతో విలువైన ఖనిజ సంపద కూడా జిల్లాలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఇంటాక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

● ఎక్కడ పడితే అక్కడే..



నగరంలో నిత్యం పాదచారులు, వాహనదారులు ఎక్కువ సంఖ్యలో నడిచే మార్గం అది. రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇటీవల సీసీ రోడ్డు వేసి మరింత విస్తరించారు. ఇప్పుడైనా కష్టాలు తీరుతాయనుకుంటే ట్రాఫిక్ అధికారుల నిర్లక్ష్యంతో సమస్య మళ్లీ యథాస్థితికి చేరింది. కొందరు వాహనదారులు ఎక్కడ పడితే అక్కడ రోడ్డుకు అడ్డంగా ఇలా తమ వాహనాలు నిలిపారు. దీంతో రద్దీగా ఉన్నసమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వాహనాలు నిలపకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

● ఈ గోతులు కనిపించలేదా సారూ..!



గోతులు లేని రహదారులు కనిపించాలని సీఎం పదే పదే చెబుతున్నా... నగరంలో రోడ్లు బాగుపడడం లేదు. గుంతల రహిత దారులంటూ చెబుతున్న మాటలు నీటి మూటలేనని స్పష్టమవుతోంది. నగరంలోని చిన్నచౌక్ రామాంజనేయపురంలో ఇలా రాళ్లు తేలి తారు పోయిన రోడ్డు సాక్షి కెమెరాకు చిక్కంది.

– రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మార్గశిర మాసం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు భగవద్గీత శ్లోక పఠన పోటీలు


భగవద్గీత పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కడప కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపీబాబు తెలిపారు. శనివారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కోదండ రామాలయంలో పోటీల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి భగవద్గీత ఆరో అధ్యాయం ఆత్మ సంయోగం గురించి 47 శ్లోకాలను అప్పగించే పోటీ ఉంటుందన్నారు. 6, 7వ తరగతులకు జూనియర్, 8, 9వ తరగతులకు సీనియర్ విభాగంగా పోటీలు ఉంటాయన్నారు. సంపూర్ణ భగవద్గీతపై పట్టుగల 18 సంవత్సరాల లోపు విద్యార్థులు జూనియర్, 18 సంవత్సరాలు పైబడిన వారిని సీనియర్ విభాగంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు విభాగాలుగా నిర్వహించే ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరి రామచంద్రారెడ్డి, రామ మహేష్, చింతకుంట శివారెడ్డి, డి.వెంకటరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, జి.సునీల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలి


మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు

వైవీయూ: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో విద్యార్థుల దాడిలో మృతి చెందిన ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని ఏపీ ఎన్‌జీఓ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ ఇలాంటి దుర్ఘటన దేశ చరిత్రలోనే లేదన్నారు. ఈ అనాగరిక చర్యలను నిలువరించేందుకు కఠిన చట్టాలు తీసుకురావాలని, ఈ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.బాలపుల్లయ్య, కె.చిన్నయ్య, శైలేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసన్, నాగార్జున, పద్మనాభం, కాటమయ్య, జానకి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో శ్రీరామ శోభాయాత్రకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న విజయ్‌భట్టర్

కడప కల్చరల్: కడప నగరంలో వచ్చే ఏడాది శ్రీరామ శోభాయాత్ర నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ కోదండరామాలయంలో ధార్మిక సంఘాల ప్రతినిధులతో శనివారం జరిగిన సమావేశంలో కోదండ రామాలయం ధర్మకర్త దేశు వెంకటరెడ్డి మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ర్యాలీ సజావుగా జరిగిందని, మరింత ఐక్యతతో ఈసారి కార్యక్రమం నిర్వహించాలని కోరారు. సమైఖ్య అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విజయ్‌భట్టర్ మాట్లాడుతూ శాస్త్రోక్తంగా యాత్ర నిర్వహించాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు తాము చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కరవర్మ, రాణా ప్రతాప్, దేవతి శంకరయ్య, ధార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలకు పంటల బీమా పథకం

చింతకొమ్మదిన్నె : అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా పంటల బీమా పథకాన్ని చెల్లించనున్నారు. మామిడి పంటకు రబీ 2024–2025 వర్తింపచేస్తున్నారు. ఐదు సంవత్సరాలు పైబడిన ఎకరం మామిడి చెట్ల పంటకు నష్టపోయినచో రూ.42,000 బీమా సంస్థ చెల్లించనుంది. ఇందుకుగాను రైతు వాటాగా ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.2,100. 15–12–2024 లోగా రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, పంట నమోదు పత్రంతో కామన్ సర్వీస్ సెంటర్ నందు లేదా రైతులే స్వయంగా పీఎంఎఫ్‌బీఐ పోర్టల్‌లో మొబైల్ ద్వారా నమోదు చేసుకోవడం వలన ఇన్సూరెన్స్ సౌకర్యం పొందవచ్చు. 15–12–2024 నుండి 31–05–2025 వరకు అధిక వర్షపాతం, గాలిలో తేమ వ్యత్యాసం, వాతావరణం వ్యత్యాసం, అధిక గాలివేగం సంబంధించిన పరిణామాలను మండల స్థాయిలో గల ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ వాతావరణ పరికరాల ద్వారా లెక్కిస్తారన్నారు. దాని ఆధారంగా ఇన్సూరెన్స్ నష్టపరిహారం చెల్లించనున్నారు. రైతులకు పంట నష్టం జరిగితే ప్రభుత్వం నుండి పంట బీమా సౌకర్యం పొందడానికి గ్రామ సచివాలయ కేంద్రంలో బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది.

డిగ్రీ పరీక్షల తనిఖీ


పరీక్షలను పరిశీలిస్తున్న ఆచార్య కృష్ణారావు

ప్రొద్దుటూరు: యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కృష్ణారావు శనివారం తనిఖీ చేశారు. నవంబర్ 29వ తేదీ నుంచి డిగ్రీ కాలేజీల్లో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణ గీతాశ్రమంలోని వేంకటేశ్వర డిగ్రీ కాలేజీతోపాటు పలు కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు.

వైభవంగా దీపోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఇందుకూరు, కొత్తపల్లె గ్రామాల్లో శనివారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో దీపోత్సవం వైభవంగా సాగింది. ఉరుటూరు మామహేశ్వర శర్మ శిష్య బృందంచే నిర్వహించిన లక్షార్చన కార్యక్రమంలో మాల ధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపు బగ్గీపై అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని ఉంచి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేరళ వాయిద్యం, చెక్కభజన, కోలాట కార్యక్రమాలు భక్తులను ఎంతగానోఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు వేచియున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్సార్టీసీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ పీటీడీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, గంగాంజనేయులు కోరారు. కడప నగరానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో ఖాళీలకు సంబంధించి ఆర్టీసీలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న 7880 మంది ఔట్ సోర్సింగ్ కార్మికుల సర్వీసులను పరిగణలోకి తీసుకుని రెగ్యులర్ ఉద్యోగులుగా అవకాశం కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఆర్టీసీ నోటిఫికేషన్ ప్రకారం సంస్థను నమ్ముకుని పనిచేస్తున్న తమకు రెగ్యులర్ ఉద్యోగాల భర్తీలో వెయిటేజీ ఇవ్వాలన్నారు. ప్రస్తుత యాజమాన్యం చెల్లిస్తున్న వేతనాలు పూర్తి స్థాయిలో కాంట్రాక్టర్ల ద్వారా అందడంలేదని, థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దుచేసి క్యాజువల్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ విషయంగా ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

ప్రీమియం హోండా కారు విడుదల


నూతన కారును ఆవిష్కరిస్తున్న సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రీమియం హోండా తమ నూతన మోడల్ ఆల్ న్యూ అమేజ్ కారును శనివారం జిల్లా మార్కెట్‌లోకి విడుదల చేశారు. కడపలోని డీలర్ ప్రీమియం హోండా షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ఎండీ నారాయణరెడ్డి, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి శనివారం నూతన కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎండీ నారాయణరెడ్డి మాట్లాడుతూ అమెజ్‌ను అత్యాధునిక సౌకర్యాలతో మూడవ జనరేషన్ వాహనంగా వినియోగదారులకు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. భద్రత విషయంలో ప్రత్యేక వసతులు ఉన్నాయని తెలిపారు. మాన్యువల్, ఆటోమేడిక్‌లో మూడు వేవరియంట్లలో వాహనాలు ఉన్నాయని, వీటి ప్రారంభ ధర రూ. 7.99 లక్షలుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్ హరిప్రసాద్, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఆత్మీయ సమావేశం

వైవీయూ: కడప నగరంలోని పలు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశాలు ఉత్సాహంగా సాగాయి. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు పాఠశాలల ప్రగతి గురించి వివరించారు. కొన్ని పాఠశాలల్లో ఆటల పోటీలు, రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి శుభదిన్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


అలంఖాన్‌పల్లె జెడ్పీ హైస్కూల్‌లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం


కడప ప్రభుత్వ అంధుల పాఠశాలలో


అంగడివీధి జెడ్పీ హైస్కూల్‌లో



కడప నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో

బాబుగారి భరోసా ఎప్పుడో !

- అర్హుల ఖాతాల్లో పీఎం కిసాన్ సొమ్ము జమ
- రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు
- పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు హామీ
- చంద్రబాబు సూపర్ సిక్స్‌లో రైతుభరోసా ఒకటి


రబీ సాగు చేసేందుకు దుక్కి దున్నుతున్న రైతు

కాశినాయన : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు సాయం అందిస్తూ సాగును పండుగలా మార్చారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో రైతుభరోసా ఒకటి. ఖరీఫ్ ముగిసి రబీ మొదలైనా బాబుగారి భరోసా రైతుల దరిచేరలేదు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని త్వరగా అమలు చేస్తే సాగుకు సాయంగా ఉంటుందని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. పుడమిపుత్రులు పొలాల బాట పట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఒకపక్క అతివృష్టి మరోపక్క అనావృష్టి, చీడపీడలు, నకిలీ విత్తనాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. గత పది రోజుల క్రితం పదును వాన కురవడంతో నియోజకవర్గంలో రబీ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. పచ్చని సిరులు పండించేందుకు ఏటా ప్రభుత్వం అందించే సాయం కోసం రైతులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పంట సాగు ఆర్థిక సాయం ఎప్పుడు వస్తుందా అనే అయోమయంలో పడ్డారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి నగదు రైతుల ఖాతాల్లో జమ అయింది. కొత్తగా పగ్గాలు చేపట్టిన టీడీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు ఆర్థిక సాయంపై ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఖరీఫ్ సాగు ముగిసి రబీ సాగు ప్రారంభించిన రైతులు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం త్వరగా వస్తే సాగుకు వెసులుబాటుగా ఉంటుందని ఆశగా చూస్తున్నారు.

ప్రభుత్వానికి రైతుల విన్నపం

గత ప్రభుత్వం వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి కలిపి రైతులకు ఏటా రూ.13500లు మూడు దఫాలుగా అందించేది. దీని వలన ఖరీఫ్‌లో పంట పెట్టుబడికి వెసులుబాటుగా ఉండేది. తొలి విడతగా మే నెలలోనే రూ.7500లు రైతు ఖాతాల్లో జమ చేసేది. దీని వలన చిన్న, సన్నకారు, పేద రైతులకు ఖరీఫ్‌లో పెట్టుబడి చాలా వరకు కలిసి వచ్చేది. మే నెలతో పాటు అక్టోబర్, జనవరి నెలల్లో ఈ రెండు పథకాల నిధులు వారి ఖాతాల్లో పడేది. వైఎస్సార్ రైతుభరోసా తొలి విడతగా రూ.5500లు, రెండవ విడత అక్టోబర్ నెలలో రూ.2 వేలు చొప్పున అందించేవారు. కేంద్రం పీఎం కిసాన్ నిధిగా రూ.6 వేలును మూడు విడతలుగా రూ.2 వేలు చొప్పున ఇచ్చేవారు. ఈ ఏడాది మే నెలలో సార్వత్రిక ఎన్నికల కారణంగా పీఎం కిసాన్ నిధి ఆలస్యంగా జూన్ నెలలో వేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు రూ.20 వేలకు సంబంధించి ఇప్పటి వరకు జీవో విడుదల కాలేదు.

రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ ఖాతాల్లో పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేస్తే సకాలంలో పంటలను సాగు చేసుకుంటామని రైతులు అంటున్నారు.

ఘనంగా చండీ హోమం



ప్రత్యేక అలంకరణలో చాముండేశ్వరి ఉత్సవమూర్తి, చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : లోక కళ్యాణార్థం స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. వేకువజామున చాముండేశ్వరి అమ్మవారికి, దత్తాత్రేయస్వామి, సత్యనారాయణస్వామి, విశ్వేశ్వరుడు, ఆంజనేయస్వామికి విశేష పూజలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. చాముండేశ్వరి అమ్మవారి వద్ద వెండి శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

మొక్కల పెంపకంపై అవగాహన

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం రామనపల్లి గ్రామంలో అటవీ యేతర ప్రాంతంలో చెట్ల పెంపక కార్యక్రమం అవగాహన, శిక్షణ సదస్సును రైతులకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ట్రీస్ ఔట్సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా (టిఒఎఫ్ఐ) ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ కె.సతీష్ ఆధ్వర్యంలో జరిగింది. రైతులకు అవగాహన, శిక్షణ సదస్సులో ఉద్యానవన మొక్కలు అలాగే అడవి జాతి మొక్కలను వ్యవసాయ భూమిలో నాటితే దానివల్ల వచ్చే ఉపయోగాలను వివరించారు. అనంతరం అదనపు ఆదాయం గురించి రైతులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశు, హార్టికల్చర్ అధికారి రెడ్డయ్య, నావంత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భగవద్గీతా ప్రవచనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఇస్కాన్ కేంద్రంలో ఆదివారం ఉదయం 11.30 గంటలకు శ్రీమద్ భక్తి వికాస స్వామి భగవద్గీతా ప్రవచనం ఉంటుందని రామ్మోహన్, శబరీష్ తెలిపారు.